# కడుపుకూటికేడిస్తే...

శీనుగాడి కడుపు ఆకలితో మండిపోతోంది. రెండురోజులుగా వాడికి సరియైన తిండిలేదు. కళ్ళు బయర్లు కమ్ముతున్నాయి. నీరసంగా తూలుతూ, రద్దీగా వున్న ఆ సెంటర్లో "బాబూ — ఆకలి వేస్తోంది. ఒక్క పైసా ధర్మం చేయండి—" అని కాళ్ళకు దణ్ణాలు పెడుతూ దీనంగా అడుక్కుంటున్నాడు.

ఒంట్లో ఓపిక లేక కాళ్ళు తడబడుతున్నాయి. లోకమంతా గిర్రున తిరుగుతున్నట్లనిపిస్తోంది. అయినాసరే తూలుకుంటూ అడుక్కొంటున్నాడు. జాలిపడిన హృదయాలు నీరసంగా వణుకుతున్న వాడిచేతిలో తమకు తోచినంత వేసి సానుభూతిని వ్యక్తం చేస్తున్నాయి. కోపం వచ్చిన హృదయాలు కన్నెఱ్ఱ చేసి, "వెధవా! పట్టుమని పదేళ్ళయినా లేవు అప్పుడే అడుక్కోన

● వంశీ - వంశీప్రియ

టం మొదలుపెట్టావా ?... పందిలా ఉన్నావు పని చేసుకొని బతకలేవూ్పు?" అని రకరకాలుగా తిట్టసాగాయి.

తిట్లు వింటున్న వాడి పసి హృదయం జాలిగా మూలిగింది. "పని చెయ్యరాదూ" అనే వారే గానీ వాడికి పనిచ్చేదెవరూ? పట్టెడు మెతుకులు పెట్టేదెవరు? నీరసంగా ప్లాట్ ఫారంమీద కూలబడ్డాడు.

ఎదురుగాఉన్న మునిసిపాలిటీ చెత్త కుండీలో ఎంగిలి విస్తరాకులు తెచ్చిపడేశాడు, హోటల్ కుర్రవాడొకడు. ఆకుల్లో మిగిలిన అన్నాన్ని చూస్తేనే శీనుగాడి నోరూరసాగింది. పుల్లిస్తరాకు లోని ఎంగిలితో కడుపునింపుకో డానికి మనస్సు వెనక్కిలాగుతోంది. కడుపుమాత్రం ఏదో ఒకటితిని ఆకలి తీర్చుకోమంటుంది

మెల్లగాలేచి కుండీవైపు నడవ బోయాడువాడు. ఇంతలో ఎక్కడినుండి వూడిపడిందో కుక్కలగుంపు. కుక్కల గుంపు పుల్లిస్తరాకులకోసం మొరుగుతూ ఒకదానిమీదొకటి కలబడుతూ నానాభీభత్సము చేయసాగినాయి.

శీనుగాడికి ఆ కుక్కలు చూస్తుంటేనే భయం వేసింది. తనుగనుక ఆ కుండీ దగ్గరకు వెళ్తే కుక్కలు చీరేస్తాయనిపించింది వాడికి.

మళ్ళీ మనుష్యుల మధ్యకు వెళ్ళిఅడుక్కోసాగాడు "పోరాఫో" అని కసురుకుంటున్నాసరే వాడు జాలిగా "బాబూ...అమ్మా"... అని!అడుక్కుంటున్నాడు. యిలా పొద్దస్తమానం అడుక్కున్నా వాడు సంపాదించగలిగే పైసలతో కడుపేమి నిండుతుంది.: ఏ టీ నీళ్ళో తాగి అర్ధాకలితో వుండడమే అవుతుంది. రెండ్రోజులనుండీ ఆ టీ నీళ్ళు కూడా లేవు. పోనీ పనేదైనా చేద్దామాఅంటే తను ఏ పనికి పనికివస్తాడో వాడికే తెలియదు. ఈ పని చెయ్యరా అని చెప్పి, పట్టెడు మెతుకులు పెట్టే వారు లేరు. ఏం చేస్తాడు? పాపం అలా అడుక్కుంటూనే వున్నాడు.

వాడి దృష్టి హోటల్ పక్కనే నిలబడి సిగరెట్ మీద సిగరెట్ తాగుతున్న ఓవ్యక్తి మీదపడింది శీనుగాడు నీట్ గా డ్రస్ చేసుకొన్న అతని వద్దకువెళ్ళి," బాబూ అకలి వేస్తోంది ఒక్క పైసా ధర్మం చేయండి"—అన్నాడు దీనంగా.

ఎక్కడో నూతిలో నుండి వచ్చి నట్లుంది వాడిగొంతు.

"పోరాపో! ధర్మం లేదు గిర్మంలేదు!" కసురుకున్నాడా వ్యక్తి శీనుగాడు. నిర్లిప్తంగా ముందుకు సాగిపోయాడు. ఇంతలో వెనుకనుండి "ఒరేయ్! ఇటు రారా!..." అని వినిపించింది. శీనుగాడు నీరసంగా వెను తిరిగి చూశాడు. తను యింతకు ముందు అడిగినవ్యక్తి చేయి వూపుతూ కనిపించాడు. శీనుగాడికి ముఖం వికసించింది. వెనుతిరిగి అతని వైపునడిచాడు.

"ఒరేయ్! యిలా అడుక్కోక పోతే ఏదయినా పని చేసుకోరాదురా..." అన్నాడావ్యక్తి ఏదయినా ధర్మం చేస్తాడని గంపెడాశతో వచ్చిన శీనుగాడికి ప్రతిక్షణము వినే ఉచిత సలహాయే అక్కడ ఎదురయే సరికి నిరాశ చెందాడు.

"ఏరా నేను పనిప్పిస్తాను చేస్తావా?" మళ్ళీఅతనే అడిగాడు. శీనుగాడికి మతిపోయినంతపనైంది.

"అలాగే బాబు! చేస్తాబాబు!" అన్నాడు ఉత్సాహంగా. వాడి కళ్ళు నూతన కాంతితో నిండినయ్! ఆవ్యక్తి వాడిని వెంటబెట్టుకొని ప్రక్కనే వున్న హోటల్ లోకి దారితీశాడు. యిద్దరు ఓ టేబుల్ ముందు కూర్చున్నారు. నాలుగు రకాల టిఫిన్ ఆర్డరుచేశాడతను. టేబుల్ మీద సర్వర్ తెచ్చిన పదార్థాలు చూడగానే శీనుగాడికి నోరూర సాగింది.

"తినరా తినూ" అన్నాడతను

"మరి, మీరు?"

"నేను తిన్నానులే! నీవుకానివ్"


"అయితే యివన్నీ నాకోసమేనా?"

"నీకోసమేరా! ముందు మాట్లాడకుండా తిను" అన్నాడతను. శీనుగాడు ఆత్రంగా తినడం మొదలు పెట్టాడు.

వాడి మనసులో మాత్రం ఎన్నో ఊహాలు... ఎన్నో భావాలు ఎన్నో అనుమానాలు...ఎన్నో భయాలు.

మనసులో చెలరేగుతున్న అలజడిని అణచుకోలేక, "నేనేం పనిచెయ్యాలి బాబుగారూ?" అన్నాడు శీనుగాడు.

"చప్తాగాని ముందుతినరా!" అన్నాడావ్యక్తి శీనుగాడు మళ్ళీ తినడంలో నిమగ్నుడయ్యాడు.




ఆ వ్యక్తి సిగరెట్ వెలిగించాడు. అతని పేరు రాజు అతనో పెద్ద ధనవంతుడికి సెక్రెటరీ. అతనికి ఆ క్షణాన గుండెలమీద నుండి పెద్దబరువును దింపినట్లుంది. అతని మనసు ఆలోచనలోకి జారిపోయింది. "ఈ రోజు తన యజమాని తనకెంత కష్టమైన సమస్య పెట్టాడు ! గొప్పవాళ్ళ కొలువు నిజంగా కత్తిమీద సామువంటిది తన అదృష్టంకొద్దీ తనకే ఉపాయం తట్టింది గనుక సరిపోయింది గానీ లేకపోతే...తనకీ, తన ఉద్యోగానికీ ఈ నాటితో ఋణం తీరిపోయేది.

తన ఉద్యోగంపోతే...యింటి దగ్గర తన ముసలితల్లి, పెళ్ళికావలసిన చెల్లెలూ, భార్యాపిల్లలూ అంతా పస్తులతో మాడవలసిందేగా ! అతనికి అంతరాయం కలిగిస్తూ శీనుగాడు బ్రేవ్ మని త్రేన్చడంతో ఈ లోకంలోకి వచ్చిపడ్డాడా వ్యక్తి.

ఇద్దరూ హోటల్ నుండి బయట పడ్డారు. శీనుగాడ్ని వెంటబెట్టుకొని అతను బజార్లో పాత యిత్తడి చెంబొకటి కొన్నాడు. "ఏమిటిసార్ పాత చెంబు మీకెందుకు ?" అనుమానంగా అడిగాడు శీనుగాడు.

దానితో పనుందిలేరా। అని చెంబు వాడిచేతికి అందించాడు. ఇద్దరూ నడవసాగారు. ఆ వ్యక్తి పక్కన నడుస్తుంటే తను ఎంతో ఎదిగిపోయినట్లు సంతోష పడిపోయాడు శీనుగాడు.

ఓ పెద్ద భవంతిలోకి శీనుగాడిని తీసుకువెళ్లాడావ్యక్తి. లోపలఓ పెద్దహాలుంది. హాలులో వున్న సోఫాలో ఓ వ్యక్తి ఖరీదయిన దుస్తుల్లో ఠీవిగా కూర్చుని వున్నాడు. శీనుగాడు పక్కగా ఒదిగి నిల్చున్నాడు. శీనుగాడితో వస్తున్న వ్యక్తిని చూస్తూనే సోఫాలో కూర్చున్నవ్యక్తి, "ఏమోయ్ సెక్రెటరీ! ఎక్కడ తగలడ్డావ్ పొద్దుట్నించీ? ఆ పోయిన చెంబుసంగతేంజేశావ్? దొంగను పట్టుకున్నావా? ఈ మాత్రంకూడా చేయ్యలేని సువ్వెందుకోయ్ నాకు సెక్రెటరీగా? నిన్ను ఈ క్షణమే డిస్మిస్ చేస్తున్నా." అన్నాడు కోపంగా.

"సార్ సార్! దొంగను పట్టుకున్నానుసార్! వీడు చెంబును బజార్లో అమ్మజూపుతుంటే పట్టుకొని లాక్కొచ్చానుసార్. చూడండిసార్, వాడిచేతిలోని చెంబుమనదే?" అంటూ శీనుగాడి మెడమీద చేయివేసి ముందుకు నెట్టాడు సెక్రెటరీ.

శీనుగాడు ఆ తోపుకు నేల మీద పడ్డాడు. వాడి చేతిలోని చెంబు నేలమీదపడి శబ్దంచేసు దొర్లింది. శీనుగాడు విస్తుపోయి తలయెత్తి సెక్రెటరీ వైపు చూశాడు.

ఆ చూపుల్లో ఎన్నోభావాలు ఆ భావాల్ని సెక్రెటరీమాత్రమే అర్థం చేసుకోగలడు. కాని అతని కడుపు...???

"వెధవని తన్నండి" అన్నాడు సోఫాలో కూర్చున్నవ్యక్తి. "పోలీసులకు ఫోన్ చెయ్యండి" అన్నారింకెవరో.

శీనుగాడునవ్వేడు. ఆ నవ్వులో ఎన్నోభావాలు... ఎంతోతృప్తి!

---

**నీలో దీపం వెలుగుతున్నంత కాలం**
**నీ వెంట నీడ వుండకపోదు**